క్లుప్తంగా

వెంకన్నకు విశేషంగా పూజలు



వెంకన్నకు పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు రామానుజమ్

సింహాచలం: వెంకటాద్రిపై కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం స్వామికి పంచామృతాభిషేకం చేశారు. అలివేలు మంగమ్మతల్లి చెంత ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు భారీగా తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకుడు రామానుజమ్ పూజలు నిర్వహించారు.

ఓటరు సర్వే పరిశీలన



కోట్నివానిపాలెంలో ఓటరు సర్వేను పరిశీలిస్తున్న ఆర్డీవో హుస్సేన్ సాహెబ్

సింహాచలం: ఇంటింటా ఓటరు సర్వే కార్యక్రమానికి ప్రజలంతా సహకరించాలని, 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ కోరారు. పెందుర్తి మండలం కోట్నివానిపాలెంలో శుక్రవారం బీఎల్వోలు చేస్తున్న ఓటరు సర్వే ప్రక్రియను పరిశీలించారు. ఓటర్లతో స్వయంగా మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటా ఓటరు సర్వేలో పరిశీలనతో పాటు చేర్పులు, మార్పులకు అవసరమైన దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు చెప్పారు. ఓటర్ల జాబితా పారదర్శకంగా రూపొందించేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని తెలిపారు.

యువకుడిపై దాడి



తలపై గాయంతో రోహిత్

సీతమ్మధార: ఓ యువకుడి తలపై గాయపరిచిన వ్యక్తిని ఫోర్త్‌టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బాధితుడు తెలిపిన వివరాలిలా.. తాటిచెట్లపాలెం రైల్వే క్వార్టర్స్ దరి రోహిత్ అనే యువకుడు నివసిస్తున్నాడు. అదే ప్రాంతంలో నివసిస్తున్న షేక్ కాజా మోహినుద్దీన్.. రోహిత్‌కు మధ్య గురువారం రాత్రి చిన్న పాటి ఘర్షణ జరిగింది. ఈ ఘటనలో మోహినుద్దీన్ దాడి చేయగా.. రోహిత్ తలకు గాయాలయ్యాయి. ఈ మేరకు శుక్రవారం ఫోర్త్‌టౌన్ పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేయగా.. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఇద్దరి ఇళ్లు ఒకే చోట ఉండటంతో గొడవ జరిగింది. దీనిపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

విద్యుత్ ఉద్యోగుల నిరసన



నిరసన తెలుపుతున్న ఏపీఎస్‌పీఈ జేఏసీ సభ్యులు, విద్యుత్ ఉద్యోగులు

సీతమ్మధార: బకాయి ఉన్న కరువు భత్యాన్ని వెంటనే విడుదల చేయాలని, ఎనర్జీ అసిస్టెంట్స్ సర్వీసులను తక్షణమే క్రమబద్ధీకరించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి(ఏపీఎస్‌పీఈ జేఏసీ) ప్రతినిధులు గణపతి, బి.నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం గురుద్వారా దరి ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలోని ఉద్యోగులు భోజన విరామ సమయంలో నల్లరిబ్బన్లు ధరించి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఔట్ సోర్సింగ్ సిబ్బందిని విద్యుత్ సంస్థలో విలీనం చేసి, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలన్నారు. 1999-2004 మధ్య నియమితులైన విద్యుత్ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలని కోరారు. పెరిగిన పనిభారానికి అనుగుణంగా అదనపు పోస్టులు వెంటనే మంజూరు చేయాలన్నారు. అర్హత గల సిబ్బందిని బదిలీ ప్రక్రియ ద్వారా జూనియర్ ఇంజినీర్, జూనియర్ అసిస్టెంట్ పోస్టుల్లో వెంటనే నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సమితి సభ్యులు కె.సత్యప్రసాద్, రత్నలరావు, వి.వి. మహేశ్వరరెడ్డి, ఎస్.చిరంజీవిరావు, టి.రామకృష్ణ, సింహాద్రిరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే సీఎం జగన్ ధ్యేయం

- ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్
- తానాంలో ఉత్సాహంగా గడప గడపకు..



వృద్ధురాలి యోగక్షేమాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్



తానాంలో మహిళలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పరవాడ: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. తానాం గ్రామంలో మూడో రోజు శుక్రవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. ఎమ్మెల్యే అదీప్‌రాజ్ ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి గడపగడపకు వెళ్లి మహిళలను ఆప్యాయంగా పలకరించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ఏ మేర అందుతున్నాయి.. అందని వారుంటే మళ్లీ ప్రభుత్వానికి దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. గ్రామానికి చెందిన డి.దేముడమ్మ అనే వృద్ధురాలిని పలకరించి జగనన్న అందిస్తున్న వృద్ధాప్య పింఛన్ అందుతుందా అని అడిగారు. వస్తుందని సంతోషం వ్యక్తం చేసిన ఆమె జగన్‌బాబే మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షిస్తున్నానని చెప్పింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని చెప్పారు. సంక్షేమ పథకాల్లో అవినీతికి ఆస్కారం లేకుండా పాలన సాగిస్తున్నారని తెలిపారు. రాజకీయాలు, కుల మతాలకు అతీతంగా ప్రతీ కుటుంబానికి సంక్షేమ పథకాలు అందిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డికి రానున్న ఎన్నికల్లో ప్రజలంతా అండగా నిలవాలని ఎమ్మెల్యే అదీప్‌రాజ్ అభ్యర్థించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు, రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ బందం నాగేశ్వరరావు, మండల జేసీఎస్ కన్వీనర్ వెన్నల సన్యాసిరావు, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, ఎంపీడీవో వి.హేమసుందరావు, ఈవోఆర్డీ పద్మజ, వ్యవసాయాధికారి సీహెచ్.చంద్రావతి, నాయుడుపాలెం సర్పంచ్ కూండ్రపు వరలక్ష్మీసీతారామయ్య, నాయకులు డెక్క నూకరాజు, బత్తి అప్పారావు, వివిధ శాఖల అధికారులు, వలంటీర్లు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సాంకేతికతను అందుబాటులోకి తేవాలి

జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ విశ్వనాథన్. చిత్రంలో చైర్మన్ ప్రసాదరాజు

మహారాణిపేట : జిల్లాలో వ్యవసాయ అనుబంధ రంగాల రైతులకు సాంకేతికత అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కేఎస్ విశ్వనాథన్ అధికారులను కోరారు. శుక్రవారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లాస్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి విత్తనాలు, ఎరువులు రైతులకు ఆర్బీకేల ద్వారా అందుబాటులో ఉంచాలన్నారు. వరి కొనుగోళ్లలో ఇబ్బందులు తలెత్తకుండా సక్రమ నిర్వహణకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. దీని వల్ల రైతులకు ఎటువంటి నష్టం వాటిల్లకుండా ఉంటుందన్నారు. కౌలు రైతులకు పంట రుణాలు రెన్యువల్ చేసేందుకు తగిన చర్యలు చేపట్టాలని బ్యాంకు అధికారులను కోరారు. ఇటీవల అధిక వర్షాల వల్ల ముంపునకు గురై నష్టం వాటిల్లిన వరినారు సమాచారం ప్రభుత్వానికి నివేదిక పంపించాలన్నారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ డీవీపీ ప్రసాద్‌రాజు మాట్లాడుతూ భూసార పరిస్థితులను బట్టి అధిక దిగుబడినిచ్చే పంటలను, పాడి, మత్స్య పరిశ్రమలకు సంబంధించి సూచనలు అందించాలన్నారు. ప్రభుత్వం అందించే రాయితీ రైతులకు ఆర్బీకే కేంద్రాల ద్వారా వర్తించేటట్లు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అప్పలస్వామి మండల, గ్రామస్థాయిలో చర్చించిన విషయాలు జాయింట్ కలెక్టర్‌కు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. పశుసంవర్ధక, ఉద్యానవన, పట్టు, ఇతర అనుబంధ శాఖలు, పౌరసరఫరాల అధికారులు చేపడుతున్న అభివృద్ధి పథకాల గురించి వివరించారు. ఈ సమావేశంలో పశుసంవర్ధక శాఖ జేడీ రామకృష్ణ , లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్, పౌరసరఫరాల కార్పొరేషన్ జిల్లా మేనేజర్ రాజేశ్వరి, ఉద్యానవన శాఖ అధికారి మన్మథరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు రక్షణగా ప్రత్యేక చట్టాలు

డీఎస్ఎన్ఎల్‌యూ ఇన్‌చార్జి వీసీ ఆచార్య శ్రీసుధ



వర్సిటీలో మానవహారంగా ఏర్పడిన న్యాయ విద్యార్థులు

సబ్బవరం: మహిళల రక్షణకు ప్రత్యేక చట్టాలు ఉన్నాయని.. వాటిపై అంతా అవగాహన కలిగి ఉండాలని దామోదర సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం(డీఎస్ఎన్ఎల్‌యూ) ఇన్‌చార్జి వీసీ ఆచార్య శ్రీసుధ అన్నారు. ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం సెంటర్ ఫర్ ఉమెన్ అండ్ చైల్డ్ లా ఆధ్వర్యంలో వర్సిటీ ప్రాంగణంలో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మహిళల అక్రమ రవాణా గురించి, దానికి గల కారణాలను విద్యార్థులకు వివరించారు. ఉపాధి పేరుతో,ప్రేమ పేరుతో ఎన్నో రకాలుగా అమ్మాయిలు అక్రమ రవాణాకు గురవు తున్నారన్నారు. ఈ అక్రమ రవాణా నేరమని, అక్రమ రవాణా నుంచి బాధితులను రక్షించడానికి అనేక చట్టాలు ఉన్నాయని తెలిపారు.అక్రమ రవాణా నివారణ చట్టం 1956, పోక్సో చట్టం ఉన్నాయని వివరించారు. చట్టాల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో విశ్వ విద్యాలయ వుమెన్ అండ్ చైల్డ్ లా డైరెక్టర్ ఆచార్య విజయలక్ష్మి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు చీరల పంపిణీ

సబ్బవరం: మదర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం పేదలకు చీరలు పంపిణీ చేయనున్నట్టు ట్రస్ట్ నిర్వాహకుడు సత్య గంగరాజు తెలియజేశారు. ట్రస్ట్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు నిర్వహించే కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చొక్కాకుల వెంకటరావు ముఖ్యఅతిథిగా పాల్గొంటారన్నారు. ఆయన చేతుల మీదుగా చీరలతో పాటు బియ్యం పంపిణీ, ఉచిత కుట్టు శిక్షణ నేర్చుకున్న మహిళలకు సర్టిఫికెట్స్ అందజేయనున్నట్టు పేర్కొన్నారు.

నేత్రపర్వంగా నిత్యకల్యాణం



తలంబ్రాలు ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం నేత్రపర్వంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనంతో కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ,తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. అర్చకులు చక్రవర్తి, శ్రీకాంత్ తదితరులు నిత్య కల్యాణం నిర్వహించారు.

ఉద్యోగుల కృషి వల్లే స్టీల్‌ప్లాంట్ పురోగతి



పదవీ విరమణ చేస్తున్న ఉద్యోగులను సత్కరిస్తున్న అధికారులు, నాయకులు

ఉక్కునగరం: ఉద్యోగుల కృషి వల్లే స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తి, ఉత్పాదకతల్లో పురోగతి సాధిస్తోందని స్టీల్ ప్లాంట్ ఇంజినీరింగ్ షాప్స్ అండ్ ఫౌండ్రీ విభాగాధిపతి ఎం.వి.ఎస్. దుర్గాప్రసాద్ అన్నారు. ఉద్యోగులు సీహెచ్. రామరాజు, వై. బాబ్జీ పదవీ విరమణ సందర్భంగా ఇంజినీరింగ్ షాప్స్‌కు చెందిన ఫోర్జ్ షాప్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సీనియర్ ఉద్యోగులను ఆదర్శంగా తీసుకోవాలని జూనియర్ ఉద్యోగులకు సూచించారు. కార్యక్రమంలో స్టీల్ ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్, విభాగం జీఎంలు పాండే, మిశ్రా, వివిధ కార్మిక సంఘాల నాయకులు గొందేశి అప్పలరెడ్డి, బోసుబాబు, శ్రీనుబాబు, భాస్కర్, కారు రమణ తదితరులు పాల్గొన్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెలుగు ఏపీఎం సాయి రమేష్

సబ్బవరం: పొదుపు సంఘాల మహిళలు ప్రభుత్వం అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలోపేతం కావాలని వెలుగు ఏపీఎం సాయిరమేష్ అన్నారు. మండలంలోని అసకపల్లి శివారు గణపతినగర్‌లో శుక్రవారం మహాగణపతి గ్రామ పరస్పర సహాయ సహకార పొదుపు సంఘం 12వ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో గ్రామ సంఘం ఆర్థిక లావాదేవీలు, ఇతర ప్రభుత్వ పథకాల కోసం చర్చించారు. ఏపీఎం సాయి రమేష్ పలు సూచనలు చేశారు. గ్రామం సంఘం అధ్యక్షురాలు కోన సోమలత అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సీసీ నీలకంఠ నాయుడుతో పాటు గ్రామ సంఘం పాలకవర్గ సభ్యులు రేసుపుడి కుమారి,కర్రి ధనలక్ష్మి, మామిడి వరహాలమ్మ, మామిడి లక్ష్మి మిగతా గ్రూపు లీడర్లు, గ్రూపు సభ్యులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ



క్షీరాభిషేక సేవలో సిరులతల్లి..

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె. శిరీష తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పై పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న గంగవరం పోర్టు కార్మికుల దీక్షలు



దీక్ష శిబిరంలో కూర్చున్న గంగవరం పోర్టు కార్మికులు

పెదగంట్యాడ: అదానీ గంగవరం పోర్టులో పని చేస్తున్న నిర్వాసిత కార్మికులకు న్యాయం చేయాలని కోరుతూ గంగవరం పోర్టు ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో పోర్టు వంతెన వద్ద చేపట్టిన నిరవధిక దీక్షలు శుక్రవారానికి 25వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి నొల్లి తాతారావు మాట్లాడుతూ గంగవరం పోర్టు నిర్మాణం కోసం భూములు త్యాగం చేసిన వారికి అన్యాయం చేయడం సరికాదన్నారు. యాజమాన్యం దిగి వచ్చి కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కొవిరి అప్పలరాజు, వాసుపల్లి ఎల్లాజీ, నొల్లి స్వామి, పేర్ల నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

'స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్‌పరం చేస్తే సహించం'



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు, కార్మికులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరణ చేస్తుంటే చూస్తూ ఊరుకోబోమని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా, అన్నింటినీ ఎదుర్కొంటామన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం నాటికి 897వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొని స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విశాఖ ఉక్కు కర్మాగారం అమ్మాలనే ఆలోచన వచ్చిన మోదీ ప్రభుత్వానికి ప్రజలు, కార్మికులు వచ్చే ఎన్నికల్లో గట్టిగా బుద్ధి చెప్తారన్నారు. ఎందరో కార్మికుల బలిదానాల ద్వారా సాధించుకున్న విశాఖ ఉక్కును ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెప్పడం దుర్మార్గమన్నారు. వెంటనే విశాఖ ఉక్కు ప్రభుత్వరంగంలోనే కొనసాగుతుందనే ప్రకటనను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

31న భారీ నిరసన : ఉక్కు దీక్షలు చేపట్టి 900 రోజులు గడుస్తున్న సందర్భాన్ని పురస్కరించుకుని ఈ నెల 31న దీక్ష శిబిరం వద్ద చేపట్టనున్న భారీ నిరసన కార్యక్రమంలో నిర్వాసితులు, కార్మికులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

భండాసుర వధపై ప్రవచనం



ప్రవచిస్తున్న రమ్యానంద భారతి

సీతంపేట: అక్కయ్యపాలెం లలితానగర్ లలితా పీఠంలో శ్రీలలితా లహరి సప్తాహ ప్రవచన కార్యక్రమం కొనసాగుతోంది. ఇందులో భాగంగా శుక్రవారం శ్రీశక్తి పీఠాధీశ్వరి రమ్యానంద భారతీ స్వామిని జగన్మాత లలితాదేవి వివిధ పరివార దేవతల శక్తులను, రాక్షస సంహారంలో వారి పాత్రల గురించి ప్రవచించారు. భండాసుర వధ ఘట్టాన్ని వివరిస్తూ శ్రీబాల త్రిపుర సుందరీ దేవి, మహాగణపతి అవతార విశేషాలు, రాక్షస సైన్య వ్యూహాలను అమ్మవారు ఎలా చిత్తుచేశారు, భండాసురుడిని ఎలా వధించారో వివరించారు. అనంతరం భక్తులందరికీ వస్త్రం, శ్రీచక్ర యంత్రాలను ప్రసాదంగా అందజేశారు. కార్యక్రమంలో వందల సంఖ్యలో భక్తులు పాల్గొని భక్తిశ్రద్ధలతో ప్రవచనాలు ఆలకించారు.

మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి



అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

దాబాగార్డెన్స్ : మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి. శివానంద్ పిలుపునిచ్చారు. మాదక ద్రవ్యాల నిరోధంపై నగరంలోని ప్రతి కళాశాలలో హిమా హ్యూమానిటేరియన్ సంస్థ విద్యార్థులకు అవగాహన శిబిరాలు నిర్వహిస్తూ కరపత్రాలు పంపిణీ చేయడం అభినందనీయమని ఆ సంస్థ ప్రతినిధులను కొనియాడారు. మాదక ద్రవ్యాల నిరోధంపై డాబాగార్డెన్స్‌లోని ఆదిత్య డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ శివానంద్ మాట్లాడుతూ సరదా కోసం, స్నేహితుల ప్రోద్బలం, ప్రభావంతో ప్రారంభించిన చెడు అలవాట్లు పిల్లల మెడకు చుట్టుకుంటున్నాయని, యువత మంచి మార్గంలో నడుచుకోవాలని హితవు పలికారు. రిటైర్డ్ జడ్జి కిషోర్‌కుమార్, పైలా సన్నిబాబు, శరగడం సురేష్‌కుమార్ డ్రగ్స్ కోసం యువత నేరాలకు పాల్పడుతున్నారని, స్కూల్ పిల్లలు సైతం డ్రగ్స్‌కి అలవాటు పడడం విచారకరమన్నారు. ఈ సందర్భంగా హిమా హ్యూమానిటేరియన్ వ్యవస్థాపక కార్యదర్శి టీవీడీ దాస్ విద్యార్థులతో మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని, అటువంటి వారు తమకు తారస పడితే వాళ్లని మందలించి సక్రమ మార్గంలో నడుచుకోమని హితబోధ చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఆదిత్య డిగ్రీ కళాశాల డైరెక్టర్ పి. రామకృష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ కె. కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్మికుల విధుల బహిష్కరణ

- కనీస వేతనాల కోసం వడ్లపూడి వేగన్ రిపేర్ వర్క్ షాప్ ఎదుట ఆందోళన



వడ్లపూడి వేగన్ రిపేర్ వర్క్‌షాప్ ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికులు

అక్కిరెడ్డిపాలెం: ప్రస్తుతం చెల్లిస్తున్న కనీస వేతనాలైనా సక్రమంగా చెల్లించాలని కోరుతూ ఆటోనగర్ ఎఫ్-బ్లాక్, చుక్కవానిపాలెం రైల్వే గేటు వద్ద గల వడ్లపూడి వేగన్ రిపేర్ వర్క్‌షాప్ (రైల్వే స్పేర్‌పార్ట్స్ రిపేర్ కంపెనీ) కార్మికులు షాప్ ఎదుట ఆందోళన నిర్వహించారు. కార్మికులు శుక్రవారం విధులను బహిష్కరించారు. ఆందోళనలో పాల్గొన్న రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పి.నరసింహ మాట్లాడుతూ వడ్లపూడి రైల్వే స్పేర్‌పార్ట్స్ కార్మికులు రోజుకు 12 గంటలు పని చేస్తున్నారని, కాని ప్రభుత్వాలు అమలు చేసిన వేతనాలు చెల్లించడం లేదని దుయ్యబట్టారు. కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ, భద్రతా నియమాలు అమలు చేయడం లేదన్నారు. రైల్వే స్పేర్‌పార్ట్స్ కంపెనీ కాలర్ కార్మికుల ప్రధాన కార్యదర్శి ఎం.రాంబాబు మాట్లాడుతూ కార్మికుల సమస్యలపై యాజమాన్యానికి ఎన్నిమార్లు వినతిపత్రాలు అందజేసినా పరిష్కారం కావడం లేదన్నారు. వర్క్‌షాప్‌లో కంపెనీ కాంట్రాక్టర్లతో సమావేశం నిర్వహించి 15 రోజుల్లోగా కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఆ సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా దువ్వాడ పోలీసులు జాగ్రత్తలు తీసుకున్నారు. కార్యక్రమంలో సిటూ గాజువాక జోన్ ప్రధాన కార్యదర్శి ఎ.లోకేష్, గాజువాక జోన్ అధ్యక్షుడు డి.రమణ, వర్క్‌షాప్ యూనియన్ నాయకులు ఎ.అవతారం, రాజు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'దేశంలో యూసీసీ సాధ్యం కాదు'

సీతంపేట: భిన్న సంస్కృతులు కలిగిన భారతదేశంలో యూనిఫామ్ సివిల్ కోడ్(యూసీసీ) ఎలా సాధ్యమని పలు దళిత సంఘాల నేతలు ప్రశ్నించారు. అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ, డీహెచ్‌పీఎస్, కేవీపీఎస్, దళిత సంఘాల ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ భవన్‌లో శుక్రవారం యూనిఫామ్ సివిల్ కోడ్‌పై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. డీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జె.వి. ప్రభాకర్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం మత స్వేచ్ఛకు రక్షణ కల్పిస్తే, దానికి భిన్నంగా బీజేపీ మనువాద సిద్ధాంతాన్ని తీసుకొచ్చి ప్రజలపై రుద్దే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు.దేశ సంపద కొందరి చేతుల్లోకి పోకుండా ఆర్థిక సివిల్ కోడ్ ఎందుకు తేవడం లేదని ప్రశ్నించారు. మణిపూర్‌లో మారణ హోమానికి బీజేపీ, దాని అనుబంధ మనువాద సంస్థలే కారణమని ఆరోపించారు. ఇద్దరు ఆదివాసీ మహిళలను నగ్నంగా రోడ్లపై ఊరేగించిన ఘటనతో దేశం మొత్తం సిగ్గుపడాలన్నారు. యూసీసీ నిర్ణయాన్ని మార్చుకోవాలని, మణిపూర్ మారణకాండపై ప్రధాని ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు.

40 కిలోల గంజాయి స్వాధీనం

ఎంవీపీకాలనీ: మన్యం నుంచి పశ్చిమ బెంగాల్‌కు గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురిని ద్వారకా పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి సుమారు 40 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ పోలీసులకు వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు దాడులు చేయగా.. ద్వారకా పోలీసు స్టేషన్ పరిధిలో వారు పట్టుబడ్డారు. దర్యాప్తు అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని ద్వారకా పోలీసులు తెలిపారు.

ప్రకృతి వనరుల పరిరక్షణ అందరి బాధ్యత



మొక్క నాటుతున్న ప్రిన్సిపాల్, విద్యార్థులు

ఎంవీపీ కాలనీ: స్థానిక వీఎంసీ డిగ్రీ కళాశాలలో ప్రకృతి వనరుల పరిరక్షణ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం, గ్రీన్ క్లైమేట్ టీం సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా ప్రిన్సిపాల్ జగదీశ్వరరావు సమక్షంలో విద్యార్థులు, అధ్యాపకులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ ప్రకృతి వనరులను కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. అడవులు, జీవావరణాలను పరిరక్షించినప్పుడే మానవ మనుగడ సజావుగా సాగుతుందన్నారు. ఆరోగ్యకరమైన జీవనం ప్రకృతి పరిరక్షణతోనే సాధ్యమవుతుందన్నారు. గ్రీన్ క్లైమేట్ వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో యువత ఎక్కువగా భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ పీవో అప్పారావు, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.